అభివాదం చేస్తున్న నాయకులు

హామీల ప్రస్తావనే లేదు

- జిల్లాకు ఏం చేస్తారో చెప్పని జగన్
- జిల్లాలో 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర
- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ఆశీర్వదించండి
- ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర శుక్రవారం కర్నూలు జిల్లాలో సాగింది. కర్నూలు జిల్లా పెంచికలపాడు నుంచి బస్సు యాత్ర ప్రారంభమైంది. కోడుమూరులో జగన్ చేనేతలతో మాటా మంతీ నిర్వహించారు. కైరవాడి, గోనెగండ్ల, రాళ్లదొడ్డి మీదుగా ఎమ్మిగనూరు వరకు యాత్ర సాగింది. ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ మైదానంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ ప్రసంగంలో హామీలను ప్రస్తావించలేదు. జిల్లాకు ఏం చేస్తారో చెప్పలేదు. ఎమ్మిగనూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక నీటి సమస్య నివారణ కోసం లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నిర్మించాలని, చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయాలని కోరినా వాటి మీద కూడా జగన్ స్పందించలేదు. వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ఆశీర్వదించాలని జగన్ కోరారు. కర్నూలు పార్లమెంట్ అభ్యర్థిగా బివై.రామయ్య, ఎమ్మిగనూరు అసెంబ్లీ అభ్యర్థిగా బుట్టా రేణుక, కర్నూలు అసెంబ్లీ అభ్యర్థిగా ఇంతియాజ్, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ ఆదిమూలపు సతీష్, పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా కె.శ్రీదేవి, మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థిగా బాల నాగిరెడ్డి, ఆదోని ఎమ్మెల్యే అభ్యర్థిగా సాయిప్రసాద్ రెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా విరుపాక్షిని గెలిపించాలని కోరారు. వీరంతా మంచి వ్యక్తులని చదువుకున్న వారని, వీరిని ఆశీర్వదించాలని అన్నారు. అనంతరం ఆరేకల్, ఆదోని క్రాస్, విరుపాపురం, ఆస్పరి, చిన్నహుల్తి, పత్తికొండ బైపాస్ మీదుగా పత్తికొండ చేరుకున్నారు. అక్కడే కెజిఎన్ ఫంక్షన్ హాలు వద్ద బస చేశారు. బహిరంగ సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మహిళా కమిషన్ మాజీ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ, సిఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, వైసిపి రీజినల్ సమన్వయకర్త రామసుబ్బారెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, కర్నూలు ఎంపీ అభ్యర్థి బివై.రామయ్య, ఎమ్మెల్యే అభ్యర్థులు, ఎమ్మెల్యేలు చెన్నకేశవ రెడ్డి, హఫీజ్ ఖాన్ పాల్గొన్నారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి చీరను అందజేస్తున్న చేనేతలు

హఫీజ్ ఖాన్‌ను రాజ్యసభకు పంపుతాం

- మేమంతా సిద్ధం సభలో జగన్ హామీ

కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హఫీజ్ ఖాన్‌ను వైసిపి ప్రభుత్వం వచ్చాక రాజ్యసభకు పంపుతామని జగన్ హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎమ్మిగనూరు మేమంతా సిద్ధం సభలో జగన్ ప్రకటించారు. హఫీజ్ ఖాన్‌కు ఎమ్మెల్యే సీటు ఇవ్వలేకపోయామని, ఆయనకు మైనార్టీ కోటాలో రాజ్యసభకు పంపుతామని ప్రకటించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఎమ్మిగనూరు వైసిపి అసెంబ్లీ అభ్యర్థి బుట్టా రేణుక మాట్లాడుతూ... ఎమ్మిగనూరు నియోజకవర్గానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమం కింద రూ.650 కోట్లు ఐదు సంవత్సరాల్లో వెచ్చించారని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కట్టుబడి ఉన్నారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ నాగులదిన్నె బ్రిడ్జిని, ఎమ్మిగనూరులో వంద పడకల ప్రభుత్వాస్పత్రికి నిధులు వెచ్చించారని తెలిపారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయిన వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాలని, చేనేతల అభివృద్ధి కోసం చేనేత హబ్ ఏర్పాటు చేయాలని కోరారు.

మహిళలు, వృద్ధులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

స్పాట్ విధులు బహిష్కరిస్తాం : ఫ్యాప్టో

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గతేడాది ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పదవ తరగతి మూల్యాంకనం డబ్బులు చెల్లించేంత వరకు స్పాట్ విధులకు హాజరుకాబోమని ఫ్యాప్టో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి, జి.తిమ్మప్ప లు పేర్కొన్నారు . శుక్రవారం సలాం ఖాన్ భవనంలో ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత సంవత్సరం 10వ తరగతి మూల్యాంకన నిధులను , అంతకుముందు సంవత్సరం సప్లమెంటరీ మూల్యాంకన విధులను విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది అవగాహన లోపం నిర్లక్ష్య ధోరణితో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులకు మూల్యాంకన నిధులను చెల్లించలేదన్నారు. ఉపాధ్యాయులంతా నిరాశనిస్పృహలతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. సుమారు రూ. 25 లక్షలకు పైగా మూల్యాంక నిధులు పెండింగులో ఉన్నాయని తెలిపారు. వాటిపై పలు దఫాలుగా జిల్లా విద్యాశాఖ అధికారులకు విన్నవించినా ఇంతవరకు చెల్లించలేదన్నారు. మార్చి 31 లోపు చెల్లించని పక్షంలో ఏప్రిల్ నెలలో ప్రారంభమయ్యే మూల్యాంకన విధులను బహిష్కరిస్తామని తెలిపారు. యుటిఎఫ్ నుండి రవికుమార్ , ఎపిటిఎఫ్ 1938 నుండి మరియానందం, ఎపిటిఎఫ్ 257 నుండి రంగన్న, ఎస్‌టియు నుండి టికె. జనార్థన్, హెచ్ఎంఎ నుండి నారాయణ, బిటిఎ నుండి నందీశ్వరుడు ఆప్త నుండి సేవా నాయక్ ,సుశీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణకు గైర్హాజరయితే చర్యలు

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 30, ఏప్రిల్ 1 తేదీల్లో పిఒలు, ఎపిఒలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. శుక్రవారం మాన్ పవర్ మేనేజ్మెంట్, ట్రైనింగ్ మేనేజ్మెంట్, ఇవిఎం నోడల్ అధికారులు, ఆర్ఒలతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30, ఏప్రిల్ ఒకటవ తేదీల్లో పిఒలు, ఎపిఒలకు సుంకేసుల రోడ్ లోని ఎంఆర్‌సి కన్వెన్షన్ హాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. మొత్తం నాలుగు సెషన్లలో 8 నియోజకవర్గాలకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు.. 30న మొదటి సెషన్‌లో మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గాలకు, రెండవ సెషన్‌లో ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాలకు, ఏప్రిల్ 1వ తేదీన మొదటి సెషన్‌లో కోడుమూరు, ఆదోని నియోజకవర్గాలకు, రెండవ సెషన్‌లో కర్నూలు, పాణ్యం నియోజకవర్గాలకు శిక్షణ ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో మొత్తం పిఒలు, ఎపిఒలు 5357 మందిని నియమించగా, ఇందులో 176 మంది రిటైర్మెంట్ తదితర కారణాలవల్ల ఆర్డర్స్ సర్వ్ చేయలేకపోయామన్నారు. మిగిలిన 5181 మందికి ఆర్డర్స్ సర్వ్ చేశామని, వీరికి 30, 01 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నామని కలెక్టర్ తెలిపారు. ఆర్డర్స్ తీసుకున్న పిఒలు, ఎపిఒలు అందరూ తప్పనిసరిగా శిక్షణకు హాజరు కావాలని ఆదేశించారు. హాజరు కాకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఏదైనా అనారోగ్య కారణాల వల్ల హాజరు కాకపోతే, మినహాయింపు కోరుతూ దరఖాస్తు అయినా పంపి ఉండాలన్నారు. శిక్షణలో తప్పని సరిగా అటెండెన్స్ తీసుకోవాలని, హాజరుకాని వారు ఉంటే, వారు తదుపరి సెషన్‌కు హాజరు కావాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్త్ గ్రౌండ్స్‌లో మినహాయింపు కోరే వారికి , స్పెషలిస్ట్ డాక్టర్ల ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపులు ఏర్పాటుచేసి, స్క్రీనింగ్ చేస్తామని, నిజంగా ఆరోగ్యం బాగోలేకపోతే మినహాయింపు ఇస్తామన్నారు. శిక్షణలో ప్రతి సెషన్‌కు 90 టేబుళ్లు ఏర్పాటు చేయాలని, టేబుల్‌కు 12 మంది చొప్పున కేటాయించి, ఇవిఎంను ఏర్పాటు చేసి హాండ్స్ ఆన్ ట్రైనింగ్ ఇవ్వనున్నామన్నారు.. ప్రతి టేబుల్ కు ఒక ఇన్‌ఛార్జ్‌ను నియమించాలన్నారు. సెక్టర్ ఆఫీసర్‌ను, ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్‌ను, బిఎల్ఒను ఇన్చార్జిగా నియమించాలని కలెక్టర్ సూచించారు.. శిక్షణలో ఊరికే చెప్పింది వినటం కాకుండా, వీడియోలను ప్రదర్శించి, తదుపరి 10 నిమిషాలు ఆ వీడియోలో చూపించిన విధంగా ప్రాక్టికల్‌గా చేయిస్తామని తెలిపారు. తనతో సహా ఆర్వోలు అందరూ మాక్ పోల్, 17సి, ఇవిఎం యాక్సెస్ తదితర అంశాల మీద శిక్షణ ఇస్తారని తెలిపారు. ఆ మేరకు ఆర్ఒలు సిద్ధమై రావాలని కలెక్టర్ ఆదేశించారు.

ఆలూరు టిడిపి అభ్యర్థిగా వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఆలూరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా బి.వీరభద్ర గౌడ్‌ను ఖరారు చేసారు. టిడిపి అధిష్టానం శుక్రవారం తుది జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో ఆలూరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా బి.వీరభద్ర గౌడ్‌ను ఖరారు చేసారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలు, 14 అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలు ఉండగా తొలి జాబితాలో జిల్లాలో తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. రెండో జాబితాలో ముగ్గురు అభ్యర్థులను ఖరారు చేసారు. మూడో జాబితాలో ఇద్దరు ఎంపి అభ్యర్థులను ఖరారు చేసారు. తాజాగా తుది జాబితాలో ఆలూరు స్థానాన్ని ప్రకటించారు. ఆలూరు టికెట్ కోసం కోట్ల సుజాతమ్మ, వైకుంఠం జ్యోతి, వీరభద్ర గౌడ్ పోటీ పడగా చివరికి ఆ టికెట్ వీరభద్ర గౌడ్‌ను వరించింది. ఆదోని స్థానాన్ని ఇటీవల బిజెపి అభ్యర్థికి కేటాయించిన విషయం తెలిసిందే.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సిఎంకు గొర్రెపిల్లను బహూకరిస్తున్న అభిమానులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మేం సిద్ధం బస్సుయాత్ర కోడుమూరు మండల కేంద్రానికి చేరుకున్న సందర్భంగా వైసిపి శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. గురువారం రాత్రి కోడుమూరు మండలం నాగలాపురం సమీపంలోని పెంచకలపాడుకు బస్సు యాత్ర చేరుకోవడంతో రాత్రి అక్కడే ముఖ్యమంత్రి బస చేశారు. తిరిగి ఉదయం ఆయన రామచంద్రపురం పాలకుర్తి మీదుగా కోడుమూరుకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో కోడుమూరు పట్టణంలో అడుగడుగునా ఆయనకు పార్టీ శ్రేణులు నీరాజనాలు పలికారు. పాత బస్టాండు సమీపంలో ఆయనకు క్రేన్‌తో ఏర్పాటుచేసిన భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చేనేతలు మగ్గాలను, కురువ గొర్ల కాపరులు గొర్రెపిల్ల గొంగలిని ముఖ్యమంత్రికి బహుకరించారు. అభిమానులు బహుకరించిన కత్తిని చేత ధరించి ప్రజలకు అభివాదం చేశారు. ఒకానొక సమయంలో మధ్యలో అంబులెన్స్ రావడంతో దారి ఇచ్చారు. అనంతరం ఈ యాత్ర వర్కూరు హెచ్. కైరవాడి, గోనెగండ్ల మీదుగా ఎమ్మిగనూరుకు బయలుదేరింది. ఈ బస్సు యాత్రలో ఆయన వెంట కర్నూలు ఎంపి అభ్యర్థి బివై.రామయ్య, కోడుమూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం సతీష్‌తో పాటు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ తదితర వైసిపి నాయకులు ఉన్నారు.

కాలిపోతున్న గడ్డివాములు

4 గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి-మద్దికేర

మద్దికేరలో భారత్ గ్యాస్ ఆఫీసు ముందు ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగు గడ్డివాములు దగ్ధమయ్యాయి. దాదాపు రూ.8 లక్షలు మేరకు ఆస్తి నష్టం వాటిలినట్లు బాధిత రైతులు న్యాసర శ్రీనివాసులు, న్యాసర హనుమంతు వాపోయారు. శుక్రవారం మధ్యాహ్నం శ్రీనివాస్, హనుమంతుల వాముదొడ్డిలో మంటలు చెలరేగాయి. మంటలకు గాలి తోడు కావడంతో గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధిత రైతులు మాట్లాడుతూ రూ.8 లక్షల మేరకు గడ్డివాములు కాలిబూడిదయ్యాయని అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో గడ్డివాములు, దగ్ధమై నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు తమ పశువులను కాపాడుకునేందుకు పశుగ్రాసాన్ని అందించాలని కోరారు.

శకునాలలో తాగునీటి ఎద్దడి

సిపిఎం నాయకులు డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఓర్వకల్లు మండలం శకునాల గ్రామం బిసి, ఎస్‌సి కాలనీలో తీవ్రమైన నీటి ఎద్దడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి బి.చంద్రబాబు నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం బృందం, శాఖ కార్యదర్శి బి చంద్రబాబు నాయుడు, సభ్యులు చాంద్ బాషా మల్లమ్మ రమాదేవిలు కాలనీలను సందర్శించి నీటి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల రోజులకు పైగా బిసి, ఎస్‌సి కాలనీ ప్రజలు మంచినీళ్ల కోసం పనులు మానుకొని నీళ్ల ట్యాంకర్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తూ ఆందోళన చెందుతున్నారని అన్నారు. శకునాల గ్రామంలో సోలార్ పరిశ్రమకు రైతులు వ్యవసాయ కార్మికులు వేలాది ఎకరాల భూములు త్యాగం చేశారని అలాంటి ప్రజలకు బోరు వేసి నీళ్లు ఇవ్వడంలో అధికారులు తీవ్రమైన జాప్యం చేస్తున్నారని విమర్శించారు. సోలార్ పరిశ్రమ వల్ల గ్రామానికి కోట్లాది రూపాయలు విడుదల అయ్యాయని ఆ డబ్బులు ఏమయ్యాయో ప్రజలకు ఎవరికి తెలియదని అన్నారు.

తాగునీటికోసం బిందెలతో పరుగులు పెడుతున్న ప్రజలు

ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి తక్షణమే బిసి, ఎస్‌సి కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మానవ జాతి పునరుద్ధరణకు క్రీస్తు సిలువ మరణం

- డాక్టర్ బి. స్టీఫెన్ చార్లెస్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

మానవ జాతిని పునరుద్ధరించడానికే క్రీస్తు సిలువ మరణం పొందాడని యెహోవా షమ్మా చర్చి పాస్టర్ డాక్టర్ బి. స్టీఫెన్ చార్లెస్ అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా స్థానిక ఆర్ఎస్ రోడ్డు కూడలి లోని యెహోవా షమ్మా చర్చిలో శుక్రవారం ప్రత్యేక ఆరాధనలో ఆయన గుడ్ ఫ్రైడే ప్రాధాన్యతను వివరించారు. క్రీస్తు సిలువలో వేలాడుతూ పలికిన ఏడుమాటలలో ఐదు మాటలను ఆయన వివరించారు. ఎస్‌టిబిసి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.ప్రశాంతి శ్యామ్ మాట్లాడారు. షమ్మా చర్చి యూత్ క్వయర్, సీనియర్ క్వయర్ వారు క్రీస్తు సిలువ శ్రమలను వివరిస్తూ భక్తి గీతాలు ఆలపించారు. ఇక నగరంలో గుడ్ ఫ్రైడే ఆరాధనలు క్రైస్తవులు అత్యంత భక్తశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక కోల్స్ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ అనిల్ సామెల్, పాస్టర్ పాస్కల్ ప్రకాష్ గుడ్ ఫ్రైడే సందేశాన్ని ఇచ్చారు. సిఎస్ ఐ చర్చిలో మాజీ బిషప్ పుష్ప లలితమ్మ సందేశం ఇచ్చారు. ప్రార్థనా మందిరంలో పాస్టర్ కరుణా సాగర్, స్టాంటన్ చర్చిలో పాస్టర్ దేవసహాయం, పాస్టర్ విక్టర్ ఇమ్మానియేల్ గుడ్ ఫ్రైడే గురించి వివరించారు. హోసన్నా మందిర్‌లో పాస్టర్ ఫ్రెడ్డి పాల్, హోరేబు చర్చిలో సంసోనన్న తదితరులు క్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను వివరించారు.

గీతాలను ఆలపిస్తున్న షమ్మచర్చి గాయకబృందం

తుగ్గలి: తుగ్గలి, రాతన, జొన్నగిరి, మారెళ్ల, ఎద్దులదొడ్డి తదితర గ్రామాలతో పాటు వివిధ గ్రామాలలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. పాస్టర్లు సుధాకర్, సువర్ణ రావు, కృప దానం మాట్లాడారు. ప్రతి ఒక్కరు మంచి మార్గంలో నడవాలని సూచింఇచారు.

రాక్ వుడ్ చర్చ్ లో ఘనంగా గుడ్ ఫ్రైడే

కర్నూలు ఆర్ఎస్‌రోడ్ లోని రాక్‌వుడ్ చర్చిలో ఉదయం11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు క్రీస్తు సిలువ ధ్యాన ప్రార్థనలు భక్తి శ్రద్ధలతో జరుపు కున్నారు. చైర్మన్ ఆనంద రావు అధ్యక్షతన, పాస్టర్ రెవరెండ్ కిషోర్ కుమార్, సెక్రటరీ డాక్టర్ స్వరూప్ సిన్హా ,బెంజమిన్ రాజు, మనోహర్, సరోజిని, డాక్టర్ రజని పాల్, రూపస్ క్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను ధ్యానించారు. అనేక మంది భక్తులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

రాక్ వుడ్ చర్చ్ లో వాక్యం వినిపిస్తున్న డాక్టర్ స్వరూప్‌సిన్హా

సి బెళగల్ : ప్రపంచ మానవాళి శాంతి సమాధానం కోసమే ఏసుక్రీస్తు సిలువలో మరణించారని సి.బెళగల్ ఎబిఎం సంఘం కాపరి సొలొమోను అన్నారు. సిలువలో పలికిన ఏడు మాటలు, ప్రాణాలు అర్పించిన క్రీస్తు జీవితం మానవాళి శాంతికి నిదర్శనం వ్యాక్యం వినిపించారు.

షమ్మ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న మహిళలు

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

తెలుగుదేశంపార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కర్నూలు జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బిటి. నాయుడు, ప్రధానకార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పార్లమెంట్ సభ్యులు సంజీవకుమార్, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, కర్నూలు అభ్యర్థి టిజి. భరత్, పార్టీ శ్రేణులతో కలిసి జిల్లా పార్టీ కార్యాలయంలో ఘణంగా నిర్వహించుకున్నారు. ముందుగా పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలిఘటించారు. పార్టీ కార్యాలయం ఆవరణలో తెలుగుదేశం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, మా తెలుగుతల్లికి మల్లెపూదండ గీతాన్ని ఆలపించారు. పార్టీ కార్యాలయహాలులో బారీ కేక్‌ను కట్టేసి ఒకరికొకరు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుతున్నారు. పార్టీ నాయకులు నంద్యాల నాగేంద్ర, పి.రవికుమార్, జె తిరుపాల్బాబు, సిపి. వెంకటేశ్వర్లు, కె.పరమేష్, సంజీవలక్ష్మి, షేక్ ముంతాజ్, సత్రం రామక్రిష్ణుడు, డి. జేమ్స్, హనుమంతరావుచౌదరి, ఎన్‌టిఆర్ అబిమానులు పాల్గొన్నారు.

టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాణ్యం మాజీ ఎమ్మెల్యే టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి, జనసేన, బిజెపి, పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి,తెలుగు యువత రాష్ట ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణ పల్లె నాగిరెడ్డి, జనసేన నాయకుడు ప్రవీణ్, అర్బన్ నాయకులు పల్లె రఘునాథ్ పాల్గొన్నారు.

ఎన్నకల ప్రణాళిక కమిటీ చైర్మన్‌గా రామస్వామి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ సార్వత్రిక ఎన్నికల ప్రణాళిక కమిటీ చైర్మన్‌గా విశ్రాంత ఉన్నతాధికారి ఎస్.రామస్వామిని నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఆయనకు నియామక పత్రం అందించి ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని డిసిసి అధ్యక్షులు కె.బాబురావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, డిసిసి గౌరవాధ్యక్షులు ఉండవల్లి వెంకటన్న, డిసిసి ప్రధాన కార్యదర్శులు షేక్ నవీద్, కె.సత్యనారాయణ గుప్త, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎస్. ప్రమీలలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఆలూరు అభ్యర్థి ఖరారు

- బహుముఖ పోరులో వరించిన టికెట్

- రెండోసారి అసెంబ్లీ అభ్యర్థిగా వీరభద్రగౌడ్ పోటీ

ప్రజాశక్తి-ఆలూరు

వీరభద్రగౌడ్

టిడిపి ఆలూరు టికెట్ బి.వీరభద్రగౌడ్‌కు కేటాయించి నెల రోజులుగా ఆశావహులు, ప్రజల్లో నెలకొన్న ఉత్కంఠతకు టిడిపి తెరదించింది. ఆలూరు బరిలో ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటించడంతో రాజకీయాలు వేడెక్కనున్నాయి. వీరభద్ర గౌడ్ కుటుంబం మొదటి నుంచి టిడిపి వెంటే నడుస్తోంది. వీరభద్రగౌడ్ తండ్రి ముద్ద బసవన్నగౌడ్ టిడిపికి వీర విధేయుడు. 2014 ఎన్నికల్లో టిడిపి అధిష్టానం వీరభద్రగౌడ్‌కు టికెట్ కేటాయించింది. ఆ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి చేతిలో కేవలం 1,919లోపు ఓట్లతో ఓడిపోయారు. టిడిపి అధిష్టానం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించడంతో ప్రజలకు అందుబాటులో ఉండి ఎన్నో అభివృద్ధి పనులు చేశారు. 2019 ఎన్నికల్లో అధిష్టానం మొండిచేయి చూపి కోట్ల సుజాతమ్మకు టికెట్ కేటాయించింది. కోట్ల సుజాతమ్మ ఆ ఎన్నికల్లో ఓడిపోగా టిడిపి అధిష్టానం ఇన్‌ఛార్జిగా నియమించింది. ఆమె ఇన్‌ఛార్జిగా ఉన్నప్పుడు పార్టీ పటిష్టతకు వీరభద్రగౌడ్ తనవంతు సహకారం అందించారు. 2024 ఎన్నికల బరిలో నిలిచేందుకు మాజీ ఇన్‌ఛార్జీలు కోట్ల సుజాతమ్మ, వైకుంఠం మల్లికార్జున చౌదరి, వైకుంఠం శివప్రసాద్, కురువ సామాజిక వర్గానికి చెందిన శశికళ కృష్ణమోహన్, ఎల్లార్తి మల్లికార్జున పోటీ పడినప్పటికీ అధిష్టానం వీరభద్రగౌడ్ వైపే మొగ్గు చూపింది. ఆయన ఎంపికతో శుక్రవారం సాయంత్రం ఆలూరులో వీరభద్రగౌడ్‌తో పాటు కార్యకర్తలు పెద్దఎత్తున ర్యాలీగా వచ్చి అంబేద్కర్, వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి శ్రేణులు, అనుచరులు బాణసంచా పేలుస్తూ సంబరాలు జరుపుకున్నారు.

టిడిపి నాయకుల సంబరాలు

ప్రజాశక్తి - ఆస్పరి

సంబరాలు చేసుకుంటున్న టిడిపి శ్రేణులు

టిడిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా వీరభద్ర గౌడ్‌ను ఖరారు చేయడంతో ఆస్పరిలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం టిడిపి అధిష్టానం టిడిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా వీరభద్ర గౌడ్‌కు అవకాశం కల్పించడంతో ఆలూరు మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ సాలి సాబ్, నాయకులు సతీష్ కుమార్, హరి, అశోక్, కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్, బస్టాండ్‌లో బాణసంచా కాల్చారు. రాబోయే ఎన్నికల్లో ఆలూరు గడ్డపై టిడిపి జెండా ఎగుర వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పెన్నిధి వీరభద్ర గౌడ్ గెలుపునకు మండలంలోని యువత అందరు కృషి చేస్తామని తెలిపారు. సర్పంచి అంజినయ్య, నాయకులు బాలు, కృష్ణ, హంపయ్య, మహేష్, వీరేష్, మారేష్, భాస్కర్, రవి, షారుక్, సాగర్, లోకేష్ పాల్గొన్నారు.

జగన్‌కు ఘనస్వాగతం

- వైసిపిలో చేరిన మాజీ ఎంపిపి కెవి.కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల

ముఖ్యమంత్రి సమక్షంలో వైసిపిలో చేరుతున్న కృష్ణారెడ్డి

మండలంలోని వెముగోడు గ్రామం నుంచి ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మతి బుట్టా రేణుక ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో తనకోసం వేచి ఉన్న వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బస్సులో నుంచి కిందికి దిగి చేతులు ఊపుతూ అభివాదం చేస్తూ చిరునవ్వుతో పలుకరిస్తూ ముందుకు సాగారు. వెముగోడు గ్రామంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి గొర్రె పిల్ల, గొంగడి, చేతికర్రను గ్రామస్తులు బహూకరించారు. ఆయన వాటిని ధరించి ప్రజలకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలో తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల అనంతరం శాశ్వతంగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మాజీ ఎంపిపి, టిడిపి నాయకులు కెవి.కృష్ణారెడ్డి ముఖ్యమంత్రి సమక్షంలో వైసిపిలో చేరారు. అనంతరం పుట్టపాశం మీదుగా హెచ్.కైరవాడి గ్రామానికి చేరుకోగానే వైసిపి నాయకులు మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు రోడ్డుపై ఉండి పూలమాలలతో స్వాగతం పలికారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో గోనెగండ్లకు జగన్మోహన్ రెడ్డి యాత్ర చేరుకుంది. ఎంపిపి నసురుద్దీన్, ఆయన కుమారుడు యూత్ నాయకులు బందేనవాజ్ ఆధ్వర్యంలో ముస్లింలు సాంప్రదాయ టోపీ, శాలువాతో సన్మానించారు. మాజీ సర్పంచి, వైసిపి జిల్లా కార్యదర్శి నాగేష్ నాయుడు, ఆయన తనయుడు రవికుమార్ నాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో స్థానిక బస్టాండ్ వద్ద స్వాగతం పలికారు. అనంతరం యాత్ర ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని రాళ్లదొడ్డి గ్రామానికి చేరుకుంది.

ప్రజలకేం చేశారని 'సిద్ధం' అంటున్నారు..?

- టిడిపి ఆవిర్భావ దినోత్సవ సభలో తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎమ్మిగనూరుకు వచ్చిన జగన్మోహన్ రెడ్డి 'మేమంతా సిద్ధం' అంటున్నారని, ప్రజలకేం చేశారని 'సిద్ధం' అంటున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాలకుర్తి తిక్కారెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు టిడిపిని స్థాపిస్తే దానిని చంద్రబాబు నాయుడు ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు. పశ్చిమ ప్రాంతంలో వర్షాల్లేక, పంటలు పండక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని తెలిపారు. వైసిపి నాయకులు మాత్రం ఇసుక, మద్యం వ్యాపారాలు చేసుకుంటూ రూ.కోట్లు వెనకేసుకుంటున్నారని విమర్శించారు. టిడిపిలోని బ్రోకర్ల ద్వారా టికెట్లు రాకుండా చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు నిజాలను తెలుసుకొని టికెట్ ఇస్తారని, టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి కచ్చితంగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెడతానని ధీమా వ్యక్తం చేశారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. అంతకుముందు ఎన్‌టి.రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, టిడిపి జెండాను ఎగురవేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు సుధీర్ రెడ్డి, రాష్ట్ర మత్స్యకారుల ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ నవీన్ కుమార్, పూజారి వ్యాసరాజాచార్ స్వామి, తెలుగు వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షులు భరద్వాజ్ శెట్టి, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎల్లారెడ్డి, సీనియర్ నాయకులు వక్రాని వెంకటేశ్వర్లు, నాడిగేని అయ్యన్న, నాడిగేని రంగన్న, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్‌రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయ రామిరెడ్డి, కొండగేని వీరారెడ్డి, టౌన్ అధ్యక్షులు పంపాపతి, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉమర్ సాబ్, ఖలందర్, వడ్డే రామయ్య, నాడిగేని వీరారెడ్డి, నర్సారెడ్డి, కప్పయ్య, డీలర్ నరసన్న, తెలుగు యువత మండల అధ్యక్షులు నాడిగేని మహాదేవ, గవిగట్టు ఈరయ్య, గుండాల ఈరయ్య, ఎంపిటిసి రాజు, మారెప్ప, నరసింహులు, ఉరుకుంద, మారేష్, లీగల్ సెల్ నాగరాజు, కృష్ణతేజ, తెలుగు మహిళ నాడిగేని నర్సమ్మ, రూతమ్మ, శకుంతలమ్మ, సరోజమ్మ, లక్ష్మి, ఐ టిడిపి పర్సాని హనుమంతు, ఉసేని పాల్గొన్నారు. **ఆదోని**లో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. టికెట్ కోసం రెండేళ్లుగా గ్రూపులుగా ఏర్పడి పోటాపోటీగా పార్టీ కార్యక్రమాలు చేశారు. చివరకు టికెట్ దక్కకపోయినా వారిలో ఐక్యత రాగం కనబడడం లేదు. శుక్రవారం టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పట్టణంలో మూడు గ్రూపులుగా ఎవరికి వారుగా నిర్వహించారు. టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు నాయకత్వంలో ఆయన స్వగృహంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి, పార్టీ జెండాను ఎగురవేశారు. అలాగే ఆదోని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ భాస్కర్ రెడ్డి మరో గ్రూపుగా ఆయన ఏర్పాటు చేసుకున్న కార్యాలయంలో ఆదోని పెద్ద మసీదు నిర్వహణ కమిటీ ఛైర్మన్ సౌదీ రావుఫ్, మాజీ కౌన్సిలర్ రామచంద్ర, ఆత్మ మాజీ ఛైర్మన్ ఫక్రుద్దీన్‌తో కలిసి ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఇంకో గ్రూపుగా ఉంటూ టికెట్ కోసం ప్రయత్నించిన టిడిపి మాజీ ఇన్‌ఛార్జి కృష్ణమ్మ తన స్వగృహంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుడిసె శ్రీరాములు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ దేవేంద్రప్పతో కలిసి ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి, టిడిపి జెండాను ఎగురవేశారు. టిడిపిలో నెలకొన్న ఈ పరిస్థితిని చూసి అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆదోనిలో ఉన్న గ్రూపులు ఇక ఎప్పుడు కలుస్తాయోనని చర్చించుకుంటున్నారు. **దేవనకొండ**లోని టిడిపి కార్యాలయంలో టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా ఎన్‌టి.రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. టిడిపి నాయకులు ఉచ్చీరప్ప, బడిగింజల రంగన్న, మాలిక్, ఆకుల వీరేష్, రాజశేఖర్ గౌడ్, చిన్న రాముడు, నాగేష్, తిమ్మప్ప పాల్గొన్నారు. **నందవరం**లోని టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి, పార్టీ జెండాను ఎగురవేశారు. జడ్‌పి మాజీ వైస్ ఛైర్మన్ పుష్పావతి, టిడిపి యువ నాయకులు గురురాజ్ దేశాయి, ఖాసీం వలీ, ఐ టిడిపి వీరేష్, రామన్న గౌడ్, సూరి, వడ్డే గోపాల్, సోమన్న, సత్యరెడ్డి పాల్గొన్నారు.

సీనియర్లు డుమ్మా

టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు టిడిపి సీనియర్ నాయకులు డుమ్మా కొట్టారు. మాజీ జడ్‌పిటిసి ఈరన్న గౌడ్, మాజీ వైఎస్ ఎంపిపి రఘు మూర్తి స్వామి, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు నాగరాజు గౌడ్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాధవ రావు దేశాయి, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, పూలచింత బండే గురు స్వామి, టిడిపి మండల కన్వీనర్ చిన రాముడు, ద్వితీయ శ్రేణి నాయకులు కూడా డుమ్మా కొట్టడంతో కార్యకర్తలు అయోమయానికి గురయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఒక గ్రూపు వారే చేస్తున్నారని సమాచారం అందడంతో పార్టీ సీనియర్ నాయకులు, కార్యక్రమంపై సరైన సమాచారాన్ని అందించకపోవడంతో నాయకులు డుమ్మా కొట్టినట్లు కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలు మరో 45 రోజులు కూడా లేకపోవడంతో మండలంలో గ్రూపు విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. గ్రూపు విబేధలతో పార్టీ కార్యక్రమాలకు నాయకులు డుమ్మా కొడుతున్నారు.

మంత్రాలయంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

ఆదోనిలో నివాళులర్పిస్తున్న మీనాక్షి నాయుడు

దేవనకొండలో...

బాబు ఆదేశాలను అమలు చేస్తాం

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జి కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

తనకు టికెట్ రాలేదన్న బాధ ఎంతో ఉందని, అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశం మేరకు కూటమి అభ్యర్థి పార్థసారథి గెలుపు కోసం కృషి చేస్తానని టిడిపి నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి గుడిసె కృష్ణమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గం నుంచి టిడిపి టికెట్ కోసం తాను ఎంతో ప్రయత్నం చేశానని, పార్టీ కోసం గత 20 ఏళ్లుగా కష్టపడి పని చేస్తున్నానని తెలిపారు. 2004లో తనకు టికెట్ వచ్చిందని, అప్పటి నుంచి తాను పార్టీ ఆదేశానుసారం పని చేశానని, ఇప్పుడు కూడా అలాగే చేస్తానని చెప్పారు. నియోజకవర్గాన్ని ప్రశాంతంగా ఉంచాలన్నా, కబ్జాల నుంచి ఆదోనిని కాపాడాలన్నా ప్రజలు కొత్త వ్యక్తికి ఓటు వేయాలని ఎదురు చూశారని, నేడు ఆ అవకాశం వచ్చిందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఎవరి ప్రలోభాలకు లొంగవద్దని, ఇప్పటికే ఎంతో నష్టపోయామని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రం దివాలా తీసిందని, బడుగు, బలహీన వర్గాలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. ప్రజలకు ఉపాధి లేకుండా వలస బాట పడుతున్నారని, ఎక్కడ చూసినా సమస్యలే అని తెలిపారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని, జిల్లాలో అత్యధిక శాతం బీసీలకు కేటాయించారని చెప్పారు. ఈ అవకాశాన్ని బీసీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ వర్గాలు కలిసికట్టుగా ఉండి అసెంబ్లీ అభ్యర్థి పార్థసారథిని, ఎంపీ అభ్యర్థి నాగరాజును గెలిపించాలని కోరారు. ఆదోనిలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలన్నా, వలసలు నివారించాలన్నా పార్థసారథిని గెలిపించాలని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ దేవేంద్రప్ప కోరారు. నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమ్మ

అపోహలు వద్దు

- టిడిపి మంత్రాలయం టికెట్ మారదు

- 20 వేల మెజార్టీతో గెలిపిద్దాం : నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

'టిడిపి మంత్రాలయం టికెట్ మారదు. పార్టీ నాయకులు, కార్యకర్తల్లో అపోహలు వద్దు. 47 రోజులు విశ్రాంతి లేకుండా శ్రమించి కలిసికట్టుగా పని చేసి టిడిపి మంత్రాలయం అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డిని 20 వేల మెజార్టీతో గెలిపిద్దామ'ని టిడిపి నాయకులు కోరారు. శుక్రవారం కౌతాళంలో టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించి, పరిచయ కార్యక్రమం, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, పెద్దకడబూరు మండల నాయకులు రమాకాంత్ రెడ్డి, యువ నాయకులు సురేష్ నాయుడు, రాజేష్, టిడిపి అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి, రామకృష్ణారెడ్డి, జనసేన నాయకులు రామాంజనేయులు మాట్లాడారు. టిడిపి బీసీల అభివృద్ధి కోసం టికెట్లను కేటాయించినట్లు తెలిపారు. మంత్రాలయం నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ వెనుకబడిందని, నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే రాఘవేంద్ర రెడ్డిని అసెంబ్లీకి పంపి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. గతంలో తిక్కారెడ్డికి టికెట్ వచ్చినప్పుడు బీసీ నాయకులంతా ఎన్నికల్లో కష్టపడి పని చేశారని తెలిపారు. ఆయన దురదృష్టం వల్ల ఓడిపోయారని చెప్పారు. చంద్రబాబు నాయుడు బీసీలకు అవకాశం కల్పించారని, తిక్కారెడ్డి కూడా రాఘవేంద్ర రెడ్డి గెలుపు కోసం కృషి చేయాల్సింది పోయి, ఇండిపెండెంట్‌గా పోటీ చేసి టిడిపి ఓట్లు చీల్చి బాలనాగిరెడ్డి గెలుపునకు పరోక్షంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కలుపుకొని ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే కౌతాళంలో రెండు ఒహెచ్ఆర్ వాటర్ ట్యాంకులు నిర్మించి రోజూ తాగునీరు అందిస్తామని తెలిపారు. ఆర్‌డిఎస్ కాలువ నిర్మించి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. తుంగభద్ర జలాలతో రైతులకు సాగునీరందించి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. చివరి ఆయకట్టుకు సాగు నీరు అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. సతీష్ నాయుడు, బస్సుల దొడ్డి ఈరన్న, మండల కన్వీనర్ జ్ఞానేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

అంబేద్కర్ సర్కిల్‌లో టెన్షన్.. టెన్షన్

కౌతాళంలోని అంబేద్కర్ సర్కిల్‌లో టెన్షన్ టెన్షన్ నెలకొంది. టిడిపి మంత్రాలయం అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి, సీనియర్ నాయకులు ఉల్లిగయ్య ఆధ్వర్యంలో స్థానిక కృష్ణ అవధూత ఆశ్రమం నుంచి ర్యాలీగా తరలివచ్చారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సమయంలో మరోవైపు నుంచి ఎమ్మిగనూరులో జరిగే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 'మేమంతా సిద్ధం' సభకు గ్రామాల నుంచి బస్సుల్లో తరలి వెళ్లారు. ఒకే సమయంలో అంబేద్కర్ సర్కిల్‌లో ఎదురెదురు కావడంతో టిడిపి కార్యకర్తలు పార్టీ జెండాలు ఊపడంతో, అటు వైసిపి కార్యకర్తలు పార్టీ జెండా ఊపడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు స్పందించి, ఇరు పార్టీల నాయకులు కూడా తమ కార్యకర్తలకు నచ్చజెబుతూ ఎవరి దారిన వారు వెళ్లిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అంబేద్కర్ సర్కిల్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు

మహారాజశ్రీ డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

E.P. No. 235/2023 in O.S. No. 632/2022

ఎం. వెంకటరమనమ్మ .... D.Hr

V/s.

ఎస్. చిన్న వెంకటేశ్వర్లు
S/o. రంగస్వామి వయస్సు 52 Years,
Govt. Teacher (Head Master) in M.P.P. School, Stantanpuram, Kurnool Town & Dist.
.... J.Dr.

పై కేసు నందు ప్రతివాది పై డిక్రి అమలుకోరి, వారి దావా మొత్తము రాబట్టుకొనుటకు నీ జీతం నుండి జప్తుకోరుతూ పలుమార్లు పై కోర్టు వారు నోటీసు పంపిన మీరు తీసుకోవటం లేదు, కావున వాది తరపున పత్రిక ముఖముగా కోర్టు వారు ఆర్డరు చేసియున్నారు. వాయిదా తేది 30-04-2024న ఉన్నది. కావున సదరు మీరు ఆదినము ఉదయం 10-30 గంటలకు మీరు కాని మీ తరుపు వకీలు గాని ఆక్షేపణలు యుంటే తెలుపుకోగలరు. లేని యెడల పరోక్షముగా తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : 30-04-2024

కె. గోపాల్,
అడ్వకేటు,
డోన్, నంద్యా జిల్లా.
సెల్ : 8341420706

మహారాజ శ్రీ కర్నూలు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఐ.ఎ.నెం.117/2023 ఇన్ ఓ.యస్.నెం.212/2023

శ్రీమతి. జి. ఉమరాణేమ్మ. ...అర్జీదారు/వాది

-ఎదురి-

బి.మాధవసుబ్బారెడ్డి మరియు మరొకరు.
...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

1,2,రెస్పాండెంట్లు/ప్రతివాదులకు నోటీసులు

1. బి.మాధవసుబ్బారెడ్డి తండ్రి బి.పుల్లారెడ్డి, వయస్సు 54 సం. వ్యవసాయదారు, బుక్కపురం గ్రామం, ప్రస్తుతనివాసం, ఇంటి.నెం. 239,శీతారాంనగర్,కర్నూలు సిటి.
2. యం.రాజశేఖర్‌రెడ్డి తండ్రి యం.నాగిరెడ్డి, వయస్సు 57 సం.వ్యవసాయదారు, ప్రస్తుతనివాసం,ఇంటి.నెం. 87/1120, కళ్యాణినగర్, విజయహస్పిటల్ ప్రక్కన, కర్నూలు సిటి.

పై నెంబరు దావాలో వాది/అర్జీదారురాలు, 1,2 రెస్పాండెంట్లు అయిన మీపైన పై దావా షెడ్యూలు ఆస్థిపై ఇంజక్షన్ కోరుతూ అర్జీ దాఖలు చేసినారు. ఇందులో 1,2,రెస్పాండెంట్లు/ప్రతివాదులైన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 30-4-2024వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అడ్వకేటు ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 13-4-2024

యం.డి.వి. జోగయ్యశర్మ,
అర్జీదారు పరం అడ్వకేటు,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఓ.యస్.నెం.212/2023

శ్రీమతి. జి. ఉమరాణేమ్మ. ...వాది

-ఎదురి-

బి.మాధవసుబ్బారెడ్డి మరియు మరొకరు.
...ప్రతివాదులు

1, 2 ప్రతివాదులకు దావా సమన్లు

1. బి.మాధవసుబ్బారెడ్డి తండ్రి బి.పుల్లారెడ్డి, వయస్సు 54 సం.వ్యవసాయదారు, బుక్కపురం గ్రామం,ప్రస్తుతనివాసం, ఇంటి.నెం. 239,శీతారాంనగర్,కర్నూలు సిటి.
2. యం.రాజశేఖర్‌రెడ్డి తండ్రి యం.నాగిరెడ్డి, వయస్సు 57సం.వ్యవసాయదారు, ప్రస్తుతనివాసం,ఇంటి.నెం. 87/1120, కళ్యాణినగర్, విజయహస్పిటల్ ప్రక్కన, కర్నూలు సిటి.

పైనెంబరు దావాలో వాది, ప్రతివాదులైన మీపైన పై దావా దాఖాలు చేసినారు. ఇందులో మొదట ప్రతివాది అయిన మీరు ఇదివరలో దావా షెడ్యూలు దాఖల ఆస్థిపై విక్రయ దస్తావేజు నెం. 516/2020 ఘనమైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు ద్వారా పొందియున్నారు. సదరు దస్తావేజును రద్దు పరచుటకు గాను. పై దావా వేసియున్నారు. సదరు దావా పైన ప్రతివాదులు అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 30-4-2024 వతేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అడ్వకేటు ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూల ముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 13-4-2024

యం.డి.వి. జోగయ్యశర్మ,
వాది పరం అడ్వకేటు,
కర్నూలు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే (శుభ శుక్రవారం)ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు క్రైస్తవ మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. 40 రోజుల పాటు క్రైస్తవులు చేస్తున్న ఉపవాసాలు ముగిశాయి. పట్టణంలోని విక్టోరియా పేట సిఎస్ఐ క్రైస్ట్ చర్చి, ఎస్‌కెడి కాలనీ సిఎస్ఐ హోలీ ట్రినిటీ చర్చి, సియోను ప్రార్థన మందిరం, మహిమ చర్చి, ఎరుషలేము, బేరియా చర్చి, రాయనగర్ ఎంబి మిస్పా చర్చి, హోసన్న మందిరంలో ఉదయం 10 గంటలకే ఆరాధన కూడికలు ప్రారంభమయ్యాయి. ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను ధ్యానించుకున్నారు. సిఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ భాస్కర్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ప్రార్థనలకు హైదరాబాద్‌కు చెందిన విజయ్ కుమార్, విక్టోరియా పేట క్రైస్ట్ చర్చికి చెందిన విలియమ్స్ సుజిత్ ఆధ్వర్యంలో ముఖ్య ప్రసంగీకులుగా గుంతకల్‌కు చెందిన సునీత విలియం హాజరయ్యారు. సంఘ పెద్దలు సునీల్ రాజ్ కుమార్, శ్రీకాంత్, డేవిడ్, ఎస్‌టి.విల్సన్ బాబు పాల్గొన్నారు. **పెద్దకడబూరు** మండలంలోని వివిధ గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెద్దకడబూరులోని సిఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో యువకులు క్రీస్తు సిలువ యాత్ర నిర్వహించారు. గ్రామ పురవీధుల గుండా ప్రార్థనలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఎస్ఐ, ఆర్‌సిఎం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సిఎస్ఐ పాస్టర్ రెవరెండ్ ముత్తుమనోహర్ బాబు, ఆర్‌సిఎం ఫాదర్ సంజీవ్‌లు ఏడు మాటల గురించి వివరించారు. **చిప్పగిరి** సియోను ప్రార్థన మందిరం సంఘ పెద్దల ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. మొదటగా ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటల ఆంతర్యాన్ని వివరించారు. పాస్టర్ జయ, పాస్టర్ జ్యోతి, పాస్టర్ జోసఫ్ మాట్లాడారు. అనంతరం ఉపవాసంలో ఉన్న క్రైస్తవులకు చల్లని పానీయాలు పంపిణీ చేశారు. సంఘ పెద్దలు సంపత్ కుమార్, స్వామి దాసు, జోసఫ్ విజయ్ కుమార్, సోలమను, ఇజ్రాయిల్, కృపాకర్, సీమోను, లాజర్ పాల్గొన్నారు. **దేవనకొండ**, పొట్లపాడు, తెర్నేకల్, బేతపల్లి, ఈదుల దేవరబండ, గద్దెరాళ్ల తదితర గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆదోని ఆర్‌సిఎం చర్చిలో సిలువను మోస్తున్న ఫాదర్

పెద్దకడబూరులో...

చిప్పగిరిలో...

వైభవంగా శ్రీసుయతీంద్ర తీర్థుల పూర్వారాధన

ప్రజాశక్తి - మంత్రాలయం

పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతులు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతులు శ్రీసుయతీంద్ర తీర్థుల పూర్వారాధనను పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం శ్రీసుయతీంద్ర తీర్థుల పూర్వారాధన సందర్భంగా శ్రీమఠంలో శ్రీసుయతీంద్ర తీర్థుల బృందావనాన్ని నిర్మాల్యం చేసి, తులసి అర్చన, పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని వెండి కవచాలతో, పుష్ప హారాలతో అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములకు విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని, శ్రీసుయతీంద్ర తీర్థుల బృందావనాన్ని దర్శించుకున్నారు. అంతకుముందు శ్రీమఠంలోని యాగశాలలో దీప ప్రజ్వలనతో శ్రీసుయతీంద్ర తీర్థుల ఆరాధన మహోత్సవాలను ప్రారంభించారు. పండితుల ద్వారా ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సిపిఎం సీనియర్ నాయకులు ఖాజా మృతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఖాజా (ఫైల్)

సిపిఎం సీనియర్ నాయకులు, ఎన్‌టిఆర్ కాలనీ ఖాజా కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. సిపిఎం నాయకులు విషయం తెలుసుకొని ఖాజా ఇంటి దగ్గరకెళ్లి ఖాజా మృతదేహానికి పూలమాల వేసి, సిపిఎం జెండా కప్పి నివాళులర్పించారు. సిపిఎం పట్టణ నాయకులు గోవిందు, రాముడు, రైతు సంఘం నాయకులు అబ్దుల్లా, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, చేనేత సంఘం నాయకులు కృష్ణ, యుటిఎఫ్ నాయకులు దావీదు, బాబు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మందకృష్ణను విమర్శించే స్థాయి బ్రహ్మయ్యకు లేదు

- ఎంఎస్‌పి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

మందకృష్ణ మాదిగను విమర్శించే స్థాయి బ్రహ్మయ్య, చిక్కం జానయ్యకు లేదని ఎంఎస్‌పి జిల్లా నాయకులు ఎస్.బాలన్న, పిఎస్.వీరేష్ మాదిగ తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని ఎంఆర్‌పిఎస్ కార్యాలయంలో సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 30న గుంటూరులో జరిగే ఆంధ్రప్రదేశ్ ఎంఆర్‌పిఎస్, అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని కొంతమంది దళిత నాయకులు అడ్డుకుంటామని చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. తెలంగాణలో కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని మార్చాలని చెప్పి ప్రెస్ మీట్ పెట్టినప్పుడు చిక్కం జానయ్య ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. మందకృష్ణ మాదిగ పెట్టిన సభకు ప్రధాని నరేంద్ర మోడీ వచ్చి 'మీరు చేసే పోరాటం న్యాయమైన పోరాటం. మీకు అండగా ఉంటాన'ని హామీ ఇచ్చారని తెలిపారు. ఎంఆర్‌పిఎస్ మాజీ అధికార ప్రతినిధి నరసింహులు, ఆదోని టౌన్ కన్వీనర్ వన్నెల మణికంఠ, మండల నాయకులు మదిరె తిమ్మప్ప, జిఎస్.దత్తు పాల్గొన్నారు.

హైబ్రిడ్ జొన్న మొలకలు తిని 23 గొర్రెలు మృతి

ప్రజాశక్తి-ఆలూరు

హైబ్రిడ్ జొన్న మొలకలు తిని మండలంలో అంగస్కల్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరులకు సంబంధించిన 23 గొర్రెలు శుక్రవారం మారకట్టు గ్రామ పొలంలో మృతి చెందాయి. పరసప్పకు చెందిన 5 గొర్రెలు, నాగరాజుకు చెందిన 8, దేవేంద్రకు చెందిన 10 గొర్రెలు మృతి చెందినట్లు తెలిపారు.

మృతి చెందిన గొర్రెలు

తుగ్గలి ఎంపిపి ఆదెమ్మ రాజీనామా

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం ఎంపిపి హనుమ రాజు ఆదెమ్మ తన పదవికి శుక్రవారం రాజీనామా చేశారు. కర్నూలులో జిల్లా పరిషత్తు సిఇఒను స్వయంగా కలిసి రాజీనామా పత్రాన్ని జిల్లా పరిషత్ సిఇఓకు సమర్పించారు. తాను వ్యక్తిగత కారణాలవల్ల రాజీనామా చేసినట్లు సిఇఒ కు సమర్పించిన రాజీనామా పత్రంలో పేర్కొన్నారు. వైసిపి అధినేతల ఆదేశాల మేరకు ఆమె రాజీనామా చేసినట్లు తెలిసింది. గత ఎన్నికలలో రెండున్నర సంవత్సరాల తర్వాత రాజీనామా చేయాలని అప్పట్లో తీర్మానం చేసుకున్నట్లు తెలుస్తుంది. అందులో భాగంగా హనుమ రాజు అదెమ్మ ఎంపీపీ పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం వైస్ ఎంపిపి మల్లికార్జున రెడ్డికి ఇన్చార్జి బాధ్యతలు వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. కొత్త ఎంపిపిని ఎన్నుకునేందుకు నోటిఫికేషన్ వచ్చిన తర్వాత శభాష్ పురం గ్రామానికి చెందిన సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు సతీమణి ఎంపిటిసి రామంజనమ్మను ఎంపిపిగా ఎన్నుకునే అవకాశాలున్నాయి.